సాక్షి
నిజామాబాద్
సోమవారం । 21 । జూలై । 2025



బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని..

ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని కలుషితం చేయొద్దని ఎన్విరాన్‌మెంట్ అండ్ వైల్డ్ లైఫ్ సొసైటీ ప్రతినిధులు కోరారు.

- 8లో ▸



యువత చెడు వ్యసనాలకు..

యువత చెడు వ్యసనాలు వీడి మంచి మార్గంలో నడవాలని స్వేరోస్ చైర్మన్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సూచించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.7 /22.9

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

- డీఎంహెచ్‌వో రాజశ్రీ



మోపాల్(నిజామాబాద్‌రూరల్) : ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ సూచించారు. మండలంలోని కాల్పోల్ గ్రామాన్ని ఆదివారం ఆమె సందర్శించారు. డెంగీ కేసులు నమోదైన నేపథ్యంలో రెండో రోజు కొనసాగుతున్న వైద్యశిబిరాన్ని పరిశీలించారు. ప్రజల ఆరోగ్యం కుదుటపడే వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని ఆమె తెలిపారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాటించాల్సిన జాగ్రత్తలను ప్రజలకు సూచించారు. దోమల లార్వా నిర్మూలనకు మందులను పిచికారీ చేయాలని, డ్రై డే పాటించాలని పంచాయతీ, వైద్య సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో మురుగు కాల్వలు శుభ్రంగా ఉంచాలని, గుంతలను పూడ్చేయాలని సూచించారు. డీఎంహెచ్‌వో వెంట డీఎల్‌పీవో శ్రీనివాస్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, ఎంపీవో కిరణ్‌కుమార్, వైద్యాధికారులు నాగరాజు, వెంకటేశ్, ప్రత్యూష, అజ్మల్ తదితరులు ఉన్నారు.

ధాన్యం డబ్బుల కోసం రైతుల తిప్పలు

- వడ్ల వ్యాపారులపై కేసు నమోదు

బోధన్‌రూరల్: దళారులను నమ్మి ధాన్యం అమ్మిన రైతులు డబ్బులు అందక తిప్పలు పడుతున్నారు. గత యాసంగి సీజన్‌లో బోధన్ మండలం రాంపూర్, కల్దుర్కి, బండర్‌పల్లి, మావందికుర్దు, మావందికలాన్, సాలూర మండలం జాడిజమాల్‌పూర్ గ్రామాలకు చెందిన పలువురు రైతులు దళారుల ద్వారా నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన వ్యాపారులు గౌర రాజేశ్, గౌర వెంకటేశ్వర్లుకు ధాన్యం విక్రయించారు. మొత్తం రూ.6.80 కోట్ల విలువజేసే ధాన్యం కొనుగోలు చేసిన వ్యాపారులు రైతులకు మొదట రూ.5.20 కోట్లు చెల్లించారు. మిగతా రూ.1.60 కోట్లు ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారు. ఎన్నిసార్లు అడిగినా డబ్బులు చెల్లించకపోవడంతో రాంపూర్ గ్రామానికి చెందిన దేవదాస్ అనే రైతు బోధన్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ భూమి చదును చేసిన 17 మందిపై కేసు

నిజామాబాద్ రూరల్: అటవీ భూమిని చదును చేసిన 17 మందిపై కేసులు నమోదు చేసినట్లు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ ఆదివారం తెలిపారు. మల్కాపూర్ తండా శివారులో శనివారం అటవీ భూమిని చదును చేసిన వారిపై కేసులు నమోదయ్యాయన్నారు. అటవీ ప్రాంతంలో ట్రాక్టర్ సహాయంతో 8 ఎకరాల భూమిని అక్రమంగా చదును చేస్తున్న విషయం తెలుసుకొని అటవీ సెక్షన్ అధికారి బాషిద్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లారని, అటవీ భూమిని చదును చేస్తున్న 17 మందిని పట్టుకొని స్టేషన్‌లో అప్పగించారన్నారు. అటవీ సంపదను కొల్లగొడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌హెచ్‌వో హెచ్చరించారు.

బహిరంగ మలవిసర్జనను నిర్మూలించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛభారత్ లక్ష్యం జిల్లా కేంద్రంలో నీరుగారుతోంది. మహిళలు, యువతులకు ఆత్మగౌరవాన్ని అందించేందుకు, ప్రజారోగ్య పరిరక్షణ కోసం పాములబస్తీలో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లను ఇటీవల కూల్చివేశారు. అయితే వాటిని కూల్చిందెవరు..? అనేది పశ్నార్థకంగా మిగిలింది. కలెక్టర్ ప్రత్యేక అధికారిగా ఉన్న నగర కార్పొరేషన్‌లో ఇదేం పరిస్థితి అని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



నేలమట్టమైన స్వచ్ఛభారత్ మరుగుదొడ్లు

కూల్చిందెవరు?

- జిల్లా కేంద్రంలోని పాములబస్తీలో సామూహిక మరుగుదొడ్లు నేలమట్టం
- మహిళలు, యువతులకు ఆత్మగౌరవం అందించడం ఇలాగేనా..?
- నీరుగారుతున్న స్వచ్ఛ భారత్ లక్ష్యం
- కార్పొరేట్ కాలేజీ కోసమేనని స్థానికుల ఆరోపణ
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న సుమారు 300 మంది
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- తాత్కాలికంగా మొబైల్ టాయిలెట్ ఏర్పాటు

ఖలీల్‌వాడి: స్వచ్ఛభారత్ లక్ష్యం జిల్లా కేంద్రంలోనే నీరుగారుతోంది. బహిరంగ మల విసర్జన రహిత నగరంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో నగరంలోని పలుచోట్ల సామూహిక మరుగుదొడ్లను నిర్మించారు. అయితే నిజామాబాద్ నగరంలోని పాములబస్తీలో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లను కొందరు వ్యక్తులు కూల్చివేశారు. ఇదేమిటని స్థానికులు ప్రశ్నిస్తే మున్సిపల్ కార్పొరేషన్ నుంచి సరైన సమాధానం రావడం లేదు. కానీ స్థానికుల సౌకర్యార్థమని ప్రతిరోజూ మొబైల్ టాయిలెట్‌ను తీసుకొచ్చి నిలుపుతున్నారు. సామూహిక మరుగుదొడ్లను అసలు ఎందుకు కూల్చివేశారో అర్థం కావడం లేదని కొందరు వాపోతుండగా, స్థానికంగా ఓ కార్పొరేట్ కళాశాల ఏర్పాటు కానుండడమే కూల్చివేతకు కారణమని మరికొందరు ఆరోపిస్తున్నారు.

స్వచ్ఛభారత్ ద్వారా కేటాయించిన నిధులతో నిజామాబాద్ నగరంలో సామూహిక మరుగుదొడ్లను నిర్మించారు. పాములబస్తీలో 90 నుంచి 100 కుటుంబాలకు చెందిన సుమారు 300 మందికి ఈ సామూహిక మరుగుదొడ్లే దిక్కు. సామూహిక మరుగుదొడ్లు నిర్మించిన తరువాత ఈ ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ చాలా వరకు మెరుగుపడిందని అంతా అనుకున్నారు. కానీ ఇటీవల సామూహిక మరుగుదొడ్లను కొందరు వ్యక్తులు కూల్చివేశారు. వాటిని మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల అనుమతితో కూల్చారా లేక ప్రైవేట్ వ్యక్తుల పనా అనేది తేలలేదు. నాటి నుంచి స్థానికులు మలవిసర్జనకు ఎక్కడికి వెళ్లాలో తెలియక ఇబ్బందులు పడ్డారు. దీనిపై మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల వద్దకు వెళ్లి తాము ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా దాటవేసి మొబైల్ టాయిలెట్ తీసుకువచ్చి జిల్లా పరిషత్ వద్ద మెయిన్‌రోడ్డుపై నిలుపుతున్నారని స్థానికులు అంటున్నారు. మహిళలు, ఆడ పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు మొబైల్ టాయిలెట్ ఉంటోందని, సాయంత్రం తరువాత పరిస్థితి ఎలా ఉంటుందో అధికారులకే అర్థం కావాలని అంటున్నారు.

ఆ కార్పొరేట్ కళాశాల కోసమేనా?

ఓ కార్పొరేట్ కళాశాల కోసం భవన నిర్మాణ పనులు పాములబస్తీలో కొనసాగుతున్నాయి. అయితే భవన నిర్మాణం కొనసాగుతున్న ప్రాంతంలోనే సామూహిక మరుగుదొడ్లు ఉండడంతో వాటిని కూల్చివేశారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మరుగుదొడ్లను కూలుస్తున్న సమయంలో స్థానికులు కొందరు అడ్డుకునే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. దీంతో మున్సిపల్ అధికారులు, వివిధ పార్టీల నాయకుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదు. కళాశాల కోసం నిర్మిస్తున్న భవనం వద్దకు కాలనీ వాసులు వెళ్లి నిలదీశారు.

ఆ రోజుల్లో మొబైల్ టాయిలెట్ కనిపించదు

జిల్లా కేంద్రం కావడంతో నగరానికి వీఐపీల రాకపోకలు, పెద్ద కార్యక్రమాల నిర్వహణ మామూలే. దీంతో మొబైల్ టాయిల్ వాహనాన్ని కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతానికి తీసుకెళ్తున్నారు. ఆ రోజుల్లో పాములబస్తీవాసులకు మొబైల్ టాయిలెట్ వాహనం అందుబాటులో ఉండడం లేదు.



జెడ్పీ వద్ద నిలిపి ఉన్న మొబైల్ టాయిలెట్

కలెక్టర్ చొరవ చూపాలి



స్వచ్ఛ భారత్ మరుగుదొడ్లను కాలనీవాసులందరం ఉపయోగించుకునేవారిమి. వాటిని కూల్చివేయడంతో ఇబ్బందిగా మారింది. మహిళలు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు, నాయకులను కలిసినా ఎవరూ స్పందించడం లేదు. కలెక్టర్ స్పందించి సామూహిక మరుగుదొడ్లు నిర్మించేలా కృషి చేయాలి.

– మహేందర్‌సింగ్, పాములబస్తీ

మరుగుదొడ్లను నిర్మించాలి



ప్రైవేట్ కాలేజీ కోసం భవనం నిర్మిస్తున్న వారిని మ రుగుదొడ్లను కూల్చివేతపై నిలదీస్తే మొబైల్ టాయిలెట్ వస్తోంది కదా అని అంటున్నారు. కొన్ని సందర్భాల్లో మొబైల్ టాయిలైట్ వాహనం రాకపోవడంతో మహిళలు, యువతులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో సామూహిక మరుగుదొడ్లను యథావిధిగా నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– లక్ష్మణ్‌సింగ్, పాములబస్తీ

■ ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ డొంకేశ్వర్ గ్రామానికి చెందిన వనపర్తి లక్ష్మి. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనప్పటికీ డబ్బులు లేక ఇంటి పనులు ప్రారంభించేందుకు ఇబ్బందులు పడింది. ఐకేపీ అధికారులు ఇంటి నిర్మాణానికి రుణాలు ఇస్తున్నారని తెలుసుకుని బ్యాంకు లింకేజీ ద్వారా రూ.3 లక్షల రుణం తీసుకుంది. ఆ డబ్బుతో ఇల్లు పని మొదలు పెట్టింది. ప్రస్తుతం గోడ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఐకేపీ రుణం ఇంటి నిర్మాణానికి ఎంతో సహాయపడిందని లక్ష్మి సంతోషం వ్యక్తం చేస్తోంది.



ఇందిరమ్మ ఇళ్లకు ఐకేపీ రుణం

- బ్యాంకు లింకేజీ ద్వారా ఆర్థిక తోడ్పాటు
- జిల్లాలో 1,927మందికి రుణాలు మంజూరు

డొంకేశ్వర్(ఆర్మూర్) : ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోలేని స్థితిలో ఉన్న లబ్ధిదారులకు గ్రామీణాభివృద్ధి శాఖ రుణాలందించి ప్రోత్సహిస్తోంది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి పథకాల ద్వారా కావాల్సినంత రుణం ఇచ్చి మహిళలకు ఆర్థిక తోడ్పాటును అందిస్తోంది. దీంతో జిల్లాలోని పలు మండలాల్లో ఇందిరమ్మ ఇళ్లను వారు ధైర్యంగా నిర్మించుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతిళ్ల కల నెరవేర్చాలనే లక్ష్యంతో అర్హులను గుర్తించింది. ఇందులో మహిళలనే లబ్ధిదారులుగా చేసింది. ప్రభుత్వం రూపొందించిన నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకునే వారికి రూ.5 లక్షలు విడతల వారీగా ఇస్తామని చెప్పడంతో చేతిలో డబ్బులున్న కొంతమంది నిర్మాణ పనులను ప్రారంభించారు. అయితే చేతిలో డబ్బుల్లేక చాలామంది ముగ్గు కూడా పోయడానికి ముందుకురాలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించేందుకు లబ్ధిదారులకు ఐకేపీ ద్వారా రుణాలు అందించాలని అధికారులకు సూచించింది. లబ్ధిదారుల్లో 99శాతం మంది మహిళా సంఘంలో సభ్యులుగా ఉన్నారు. వీరికి బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రుణాలు తీసుకునేలా మహిళలకు అవగాహన కల్పించి ప్రోత్సహించారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1,927 మంది లబ్ధిదారులకు రూ.21.82 కోట్లకు పైగా రుణాలను అందజేసి ఇళ్ల నిర్మాణాలకు తోడ్పాటును అందించారు. రూ.50 వేల నుంచి రూ.3 లక్షల దాకా రుణాలు ఇచ్చారు. అత్యధికంగా సిరికొండలో 113 మందికి, కమ్మర్‌పల్లిలో 116 మందికి, నందిపేట్, ముప్కాల్, ఎడపల్లి, సిరికొండ, వేల్పూర్ మండలాల్లో కూడా వంద మందికి పైగానే రుణాలిచ్చారు. ఇందిరమ్మ ఇళ్లకు రుణాలివ్వడంతో బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి లక్ష్యాల సాధన కూడా తమకు సులభం అవుతోందని అధికారులు పేర్కొంటున్నారు.



ఐకేపీ రుణంతో డొంకేశ్వర్‌లో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటున్న చిలుక సునీత

నియోజకవర్గాల వారీగా అందించిన రుణాలు (కోట్లలో)

నియోజకవర్గం	లబ్ధిదారులు	పొందిన రుణాలు
ఆర్మూర్	346	3.77
బాల్కొండ	490	4.83
బాన్సువాడ	192	2.10
బోధన్	370	4.76
నిజామాబాద్‌రూరల్	529	6.36
మొత్తం	1,927	21.82

నేడు దాశరథి కృష్ణమాచార్య శతజయంత్యుత్సవాలు

నిజామాబాద్ రూరల్: మహాకవి డా.దాశరథి కృష్ణమాచార్య శతజయంతి ఉత్సవాలను నగరంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో సోమవారం నిర్వహించనున్నట్లు దాశరథి కృష్ణమాచార్య జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కోనేరు సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, ప్రత్యేక అతిథులుగా తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ వెన్నెల, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ డైరెక్టర్ గడుగు గంగాధర్, డీఈవో అశోక్, నుడా చైర్మన్ కేశవేణు పాల్గొంటారని వివరించారు. కార్యక్రమానికి కవులు, కళాకారులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఫోన్‌మిత్ర.. తల్లిదండ్రులకు నిశ్చింత

- ఎస్సీ గురుకులాల్లో ఫోన్ బాక్సులు
- తల్లిదండ్రులతో మాట్లాడే వెసులుబాటు
- పిల్లల్లో మానసిక స్థైర్యం పెంపునకు దోహదం

ఆర్మూర్ టౌన్: ఇంటికి దూరంగా ఉంటూ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/ కళాశాలలో చదివే విద్యార్థుల బెంగ తీరింది. తల్లిదండ్రులకు తమ పిల్లలు ఎలా ఉన్నారన్న ఆందోళనా పోయింది. రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో 'ఫోన్ మిత్ర' కార్యక్రమం ప్రారంభించింది. జిల్లాలోని తొమ్మిది సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఫోన్ మిత్ర సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. దీంతో తల్లిదండ్రులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల సంఖ్యకు సరిపడా బాక్సులు..

జిల్లాలో ఆరు బాలికల, మూడు బాలుర సాంఘిక సంక్షేమ పాఠశాలలు, కళాశాలలు, సుమారు 5,500 మంది విద్యార్థులు చదువుతున్నారు. 'ఫోన్ మి త్ర'లో భాగంగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఫోన్ బాక్సులను ఏర్పాటు చేశారు. ఈ ఫోన్ల నుంచి తల్లిదండ్రులు, సంరక్షకులకు మాత్రమే కాల్స్ వెళ్లేలా స్మార్ట్‌కార్డులను తయారు చేశారు. స్మార్ట్ కార్డును ఫోన్ బాక్స్‌లో స్వైప్ చేసి విద్యారులు తమకు ఇచ్చిన సంఖ్యను నొక్కితే నేరుగా తల్లిదండ్రులకు కాల్ వెళ్తుంది. గురుకులంలో ఉన్న సమస్యలు, ఇబ్బందులను నేరుగా అధికారులు, సొసైటీ కార్యాలయానికి తెలిపేందుకు ఇతర అంకెలను ఫోన్‌బాక్సుల్లో పొందుపర్చారు. నలుగురు విద్యార్థులకో స్మార్ట్ కార్డును అందజేశారు. రోజులో 25 నిమిషాలపాటు మాట్లాడే వీలు కల్పించారు. దీంతో సులభంగా యోగక్షేమాలు తెలుసుకునే అవకాశం ఏర్పడింది. కాగా, ఇంటికి దూరంగా ఉన్న పిల్లల్లో మానసిక స్థైర్యం పెరుగుదలకు ఫోన్‌మిత్ర దోహదపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



ఫోన్‌బాక్స్ ద్వారా తమ తల్లిదండ్రులతో మాట్లాడుతున్న విద్యార్థులు

ఆరు ఫోన్‌ల ఏర్పాటు

ఈ నెల మొదటివారంలో 'ఫోన్‌మిత్ర' ప్రారంభమైంది. 6 ఫోన్ బాక్సులు ఏర్పాటు చేశారు. ఫోన్ మిత్ర ద్వారా విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడుతున్నారు. బాగోగులు తెలుసుకుంటున్నారు.

– జి.సుదర్శన్, ప్రిన్సిపల్, ఎస్సీ గురుకుల బాలుర పాఠశాల, వేల్పూర్

సంతోషంగా ఉంది..

'ఫోన్‌మిత్ర' ద్వారా తలిదండ్రులతో మాట్లాడటం సంతోషంగా ఉంది. గతంలో టీచర్లు, ఇతర విద్యార్థుల తల్లిదండ్రు ల ఫోన్లతో కుటుంబసభ్యులతో మాట్లాడేవాళ్లం. ఇప్పుడు రోజూ మాట్లాడే అవకాశం కల్పించారు.

– రాజు, విద్యార్థి

వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యవర్గం

నిజామాబాద్ నాగారం: జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి బొబ్బిలి చిన్నారెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య ఆధ్వర్యంలో ఎన్నికలను జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవనంలో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా గాండ్ల లింగం, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ రవీందర్, కోశాధికారిగా ఆకుల నాగరాజు, ఉపాధ్యక్షులుగా బంటు బలరాం, యెండల స్వప్న, సంయుక్త కార్యదర్శులుగా అబ్బయ్య, శ్యామల, కార్యవర్గ సభ్యులుగా విజయ్ మోరె, రాజేశ్వర్, ఎం నరేశ్, శివకృష్ణ, అఖిల ఎన్నికయ్యారు. మరికొంత మంది సభ్యులతో పూర్తి కార్యవర్గాన్ని త్వరలోనే ప్రకటిస్తామని నూతన అధ్యక్షుడు గాండ్ల లింగం తెలిపారు. పీడీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, నెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, పీఈటీలు పాల్గొన్నారు.

ఆషాఢం బోనాలు



జిల్లాలో ఆషాఢ మాసం బోనాల పండుగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో బోనాలు తీసి అమ్మవార్లకు సమర్పించారు. ఆయురారోగ్యాలతో ఉండేలా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. – నిజామాబాద్ రూరల్

కరుణించవా.. వరుణదేవా



రెంజల్ మండలం బాగేపల్లిలో ఆదివారం నారుమడికి చేతితో నీరు పోస్తున్న రైతు

- మురిపిస్తున్న మేఘాలు.. కురవని వర్షాలు
- సాగునీటి కోసం రైతుల ఇబ్బందులు
- పంటల రక్షణకు తంటాలు
- వర్షాల కోసం ఆలయాల్లో పూజలు

మోర్తాడ్(బాల్కొండ): ఆకాశంలో మేఘాలు కమ్ముకుంటున్నా.. వర్షం కురిపించడంలో వరుణదేవుడు దోబుచులాడుతున్నాడు. చినుకు జాడ లేక పంట భూములు తడారి పోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరుణుడి కరుణ కోసం వివిధ గ్రామాలలో ప్రజలు గ్రామ దేవతలు, ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దేవతా విగ్రహాలకు జలాభిషేకం చేస్తున్నారు. మరోవైపు జూన్ నెల నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 299 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 222 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 25 శాతం వర్షపాతం లోటు ఉందని వాతావరణ శాఖ లెక్కలు వెల్లడిస్తున్నాయి.

4.59లక్షల ఎకరాల్లో సాగు

వాతావరణం అనుకూలంగా ఉంటుందనే నమ్మకంతో రైతులు జిల్లా వ్యాప్తంగా 4,59,865 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. ఇందులో వరి 3.26లక్షలు, మొక్కజొన్న 47వేలు, సోయా 32వేలు, పసుపు 23వేల ఎకరాల్లో సాగు అవుతుంది. ఆయిల్‌పాం 11వందల ఎకరాలు, ఇతర రకాల పంటలు 30వేల ఎకరాల్లో సాగవుతున్నాయి. గత సీజన్ కంటే ఈసారి వరి సాగు విస్తీర్ణం 79వేల ఎకరాలు పెరిగింది. ముందస్తు వర్షాలు కురువడంతో వరి సాగుకు ఆసక్తి చూపిన రైతులు.. ప్రస్తుతం వర్షాలు లేక ఆకాశం వైపు చూస్తున్నారు.

ఇంకిపోతున్న బోరుబావులు

వర్షాలు సమృద్ధిగా కురువకపోవడంతో భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయి. ఫలితంగా బోరుబావుల నుంచి గతంలో మాదిరి నీరు రావడం లేదు. చాలా చోట్ల కొత్త బోరుబావులు తవ్వించే పరిస్థితి ఉంది. అల్పపీడనం వంటిది ఏర్పడితే తప్ప భారీ వర్షాలకు అవకాశం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



శెట్‌పల్లిలో ఎండిపోతున్న వరినారు

వెలవెలబోతున్న వాగులు



మోర్తాడ్ వద్ద పెద్దవాగు చెక్‌డ్యాం వెలవెల

ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాకపోవడంతో వాగులు, వొర్రెలు నీరు లేక వెలవెలబోతున్నాయి. చెరువులలోనూ నీరు లేక సాగునీటిని అందించని దుస్థితి ఏర్పడింది. మే నెలలో వర్షాలు కురిసినా వేసవి తీవ్రతకు ఆ నీరు భూమిలో ఇంకలేదని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. వర్షాకాలం ఆరంభమై 45 రోజులు గడచినా భారీ వర్షపాతం నమోదు కాకపోవడంతో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గత సంవత్సరంతో పోల్చితే ఈసారి తక్కువ వర్షాలే కురిశాయని తెలుస్తోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు సరైన ఇన్‌ఫ్లో లేకపోవడంతో నీటి విడుదల షెడ్యూల్ ఇంకా ఖరారు కాలేదు. షెడ్యూల్ ఖరారు చేసి ఉంటే లక్ష్మి కాలువ ద్వారా నీటి విడుదల జరిగేది. వేంపల్లి, చౌటపల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకాలకు సాగునీరు అందించేందుకు అవకాశం ఏర్పడేది.

క్లుప్తంగా

బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని కలుషితం చేయొద్దు



ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో అవగాహన కల్పిస్తున్న సొసైటీ ప్రతినిధులు, విద్యార్థులు

డొంకేశ్వర్: పచ్చికబయళ్లతో ఆహ్లాదాన్ని పంచుతున్న ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని ప్లాస్టిక్ వ్యర్థాలతో కలుషితం చేయొద్దని ఎన్విరాన్‌మెంట్ అండ్ వైల్డ్‌లైఫ్ సొసైటీ ప్రతినిధులు పర్యాటకులను కోరారు. ఆదివారం నవ్యభారతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులతో కలిసి డొంకేశ్వర్ మండలం చిన్నయానం బ్యాక్ వాటర్ వద్ద పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. బ్యాక్ వాటర్ ప్రాంతానికి సందర్శకుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుందని, ప్లాస్టిక్ వ్యర్థాలు, మద్యం సీసాలతో ప్రకృతిని పాడు చేయొద్దని కోరారు. ఈ సందర్భంగా చెత్త డబ్బాల ద్వారా చెత్తను సేకరించారు. పర్యాటకులకు ట్రాష్ బ్యాగులు అందజేసి అందులో వేయాలని సూచించారు. మాజీ ఎంపీటీసీ చిన్నారెడ్డి, సొసైటీ కార్యదర్శి సంతోష్ కుమార్, హీతెన్ భీమాని, స్కూల్ ప్రిన్సిపాల్ ఆంతోని, విద్యార్థులు పాల్గొన్నారు.

సాహిత్యంలో వరలక్ష్మికి డాక్టరేట్



డొంకేశ్వర్(ఆర్మూర్): సాహిత్యంలో రాణిస్తున్న డొంకేశ్వర్ మండలం తొండాకూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ వరలక్ష్మికి డాక్టరేట్ లభించింది. కరీంనగర్‌లో ఆదివారం జరిగిన జాతీయస్థాయి భారత్ విభూషణ్–2025 అవార్డుల ప్రదానోత్సవంలో డే స్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను అందజేసింది. డాక్టరేట్‌ను అందజేసి ప్రోత్సహించిన యూనివర్సిటీకి ఈ సందర్భంగా వరలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

నిధులు మంజూరు చేయండి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సునీల్‌రెడ్డి

మోర్తాడ్: బాల్కొండ నియోజకవర్గంలో అత్యవసరంగా చేపట్టబోయే పనులకు నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి కోరారు. సీఎం హైదరాబాద్‌లోని తన నివాసంలో సునీల్‌రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని మండలాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని జాబితా అందించారు. దీనికి స్పందించిన సీఎం నిధుల మంజూరుకు హామీ ఇచ్చారు.



మాక్లూర్‌లో బోనాల ఊరేగింపులో పాల్గొన్న గౌడ కులస్తులు



మోపాల్ మండలం మంచిప్పలో గ్రామస్తులు

బోనమెత్తిన ఇందూరు



చంద్రనగర్‌లో పుట్టమైసమ్మకు పూజలు చేస్తున్న భక్తులు





నగరంలోని కోటమైసమ్మ ఆలయానికి బోనాలతో వెళ్తున్న మహిళలు

నిజామాబాద్ రూరల్/ నిజామాబాద్ సిటీ/ మోపాల్/ మాక్లూర్/ రుద్రూర్: ఇందూరులో బోనాల పండుగను ప్రజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆషాఢమాసంలో చివరి ఆదివారం కావడంతో పల్లెల్లో, మండలాల్లో, జిల్లా కేంద్రంలో ఎటు చూసినా ప్రజలు బోనాలను ఎత్తుకొని స్థానిక అమ్మవార్లకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. నగరంలోని కోటమైసమ్మ, చంద్రనగర్‌లో ఉన్న పుట్టమైసమ్మ ఆలయాల్లో స్థానికులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటగల్లిలో ఉన్న మైసమ్మ వీధిలో భక్తులు ఊరేగించిన బోనాలు, నైవేద్యాలను అమ్మవారికి సమర్పించారు. నగరంలోని సిర్నాపల్లి గడిలోని పట్టణ గాండ్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల పండుగలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు, నుడా చైర్మన్ కేశ వేణు పాల్గొన్నారు. బోనం ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు. మోపాల్ మండలం మంచిప్పలో గ్రామస్తులను బోనాల ఊరేగింపు చేపట్టారు. మాక్లూర్ మండల కేంద్రంలో గౌడ కులస్తులు బోనాల పండుగను నిర్వహించారు. రుద్రూర్ మండలం బొప్పాపూర్‌లో గ్రామస్తులను బోనాలతో ఊరేగించారు. స్థానిక గ్రామదేవలకు బోనాలను సమర్పించి పూజలు చేశారు.



రుద్రూర్ మండలం బొప్పాపూర్‌లో గ్రామస్తులు



సిర్నాపల్లిగడి ఎదుట నిర్వహించిన బోనాల వేడుకల్లో నుడా చైర్మన్ కేశవేణు, నాయకులు



బోనాలను ఊరేగిస్తున్న గాండ్ల సంఘం సభ్యులు



కోటగల్లి మైసమ్మ వీధిలో..

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన న్యాయవాద పరిషత్ సభ్యులు



నిజామాబాద్ లీగల్: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి నూనెపల్లి హరినాథ్ హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా న్యాయవాద పరిషత్ సభ్యులు, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా న్యాయవాదులు ఆదివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. యువ న్యాయవాదులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యం పెంచుకొని వృత్తిలో ముందుకు సాగాలని సూచించారు. న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్‌గౌడ్, ఉమ్మడి జిల్లా న్యాయవాదులు సంతోష్ శర్మ, భార్గవ్ భూపాల్, గంగరాజు, విఠల్ రావు, సంతోష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు



గడ్కోల్ వద్ద తెగిపోయిన తాత్కాలిక రోడ్డు

సిరికొండ: మండలంలోని గడ్కోల్ వద్ద కప్పలవాగుపై తాత్కాలికంగా వేసిన రోడ్డు వరద ప్రవాహానికి కొట్టుకుపోయింది. వాగుపై భారీ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 12 కోట్లు మంజూరు చేసింది. పనులు ప్రారంభించి ఏడాదిన్నర అవుతుండగా, పిల్లర్ల వరకు మాత్రమే పూర్తయింది. రాకపోకలకు వాగులో తాత్కాలికంగా మట్టి రోడ్డు వేశారు. శనివారం రాత్రి కురిసిన వర్షానికి వాగు ప్రవహించడంతో తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో గ్రామానికి భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వాగు అవతల పంట పొలాలు ఉన్న రైతులు వంతెన వద్ద నిర్మించిన చెక్‌డ్యాం పైనుంచి రాకపోకలు సాగిస్తున్నారు.

గంజాయి పట్టివేత

బోధన్ టౌన్: పట్టణంలోని ఆచన్‌పల్లి బైపాస్‌రోడ్‌లో ఆదివారం రాత్రి కార్తీక్ అనే యువకుడి నుంచి 19 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు బోధన్ పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. బైపాస్ రోడ్‌లో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. యువకుడి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని విచారించగా రెంజల్ బేస్ ప్రాంతంలో ఉండే ఓ వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేశాడన్నారు. యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



దాసరి కిషన్

ఖలీల్‌వాడి: నగరంలోని శివాజీనగర్‌కు చెందిన దాసరికిషన్(60) అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు రెండో టౌన్ ఎస్సై సయ్యద్ ముజాహిద్ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శివాజీ నగర్‌కు చెందిన దాసరి కిషన్ ఈనెల 18న మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. కిషన్ కుమారుడు బాలకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైల్వే సేవలు ఒకే యాప్‌లో..

మీకు తెలుసా?



ఖలీల్‌వాడి: గతంలో రైల్వేశాఖ ద్వారా అందిస్తున్న సేవల కోసం వివిధ యాప్‌లు అందుబాటులో ఉండేవి. కానీ ఇప్పుడు వాటిని తొలిగించి వాటి స్థానంలో రైల్ వన్ అనే యాప్‌ను రైల్వేశాఖ అందుబాటులోకి తెచ్చింది. జూలై 1 నుంచి ఈ యాప్ అమలులోకి వచ్చింది. ఈ యాప్‌లో రైలు టికెట్ రిజర్వేషన్ తోపాటు అన్ని రకాల టికెట్లను ఈ యాప్ ద్వారా పొందవచ్చు. రైళ్ల రాకపోకలకు సంబంధించిన వివరాలు, రైలు ఎక్కడున్నదనే అంశాలు స్పష్టంగా తెలుస్తుంది. రైలు సమయపాలన తోపాటు ఏ ప్లాట్ ఫారంపై ఆగుతుంది, కోచ్ ఎక్కడ, పీఎన్‌ఆర్ స్థితి, రైలెక్కడ ప్రయాణిస్తుందో.. రైలు రిజర్వేషన్ రద్దు లాంటి తదితర అంశాలు అన్నీ ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. రైలులో ప్రయాణం చేసేటప్పుడు అవసరమైతే ఫుడ్‌ను ఆర్డర్ చేసుకుంటే మనం ప్రయాణిస్తున్న స్థానానికి తీసుకొచ్చి ఇస్తారు. ఈ యాప్ గూగుల్ ప్లేస్టోర్ ద్వారా, ఐవోస్ యాపిల్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మెయిల్ ఐడీ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని పాస్‌వర్డ్ పెట్టుకోవడం ద్వారా వినియోగించుకోవచ్చు.

గొడుగు నీడలో.. బతుకుబాటలో..



ఆర్మూర్ పట్టణంలోని ఎంజీ రోడ్ పక్కన గొడుగు కింద కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం

కుటుంబ పోషణకు కూరగాయలు విక్రయించే రైతులు, చిరు వ్యాపారులు ఎండా, వానల ఇబ్బందులను గొడుగుల సాయంతో అధిగమిస్తున్నారు. ఆర్మూర్ పట్టణంలోని ఎంజీ రోడ్ పక్కన వివిధ గ్రామాల నుంచి వచ్చిన కూరగాయల వ్యాపారులు వరుసగా గొడుగుల కింద కూర్చొని కూరగాయాలను విక్రయిస్తున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ముళ్లపొదల్లో మోడల్‌రూం..!

- శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌తో పాటే నిర్మాణం
- పట్టించుకోని అధికారులు



ముళ్ల పొదల్లో ఉన్న మోడల్ రూం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద కాకతీయ కాలువ దిగువన, గోదావరి గట్టున నిర్మించిన మోడల్ రూం ముళ్లపొదల్లో మగ్గుతోంది. భవిష్యత్తు తరాలకు ప్రాజెక్ట్ నిర్మాణాన్ని వివరించుట కోసం దీనిని నిర్మించారు. ప్రస్తుతం దీనిని పట్టించుకునే ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ మోడల్ రూంను ప్రాజెక్ట్ నిర్మాణ కాలంలోనే నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేశారు. 1983లో భారీ వరదలు వచ్చిన సమయంలో మోడల్ కల చెదిరి పోయింది. అప్పటి వరకు ప్రాజెక్ట్ నిర్మాణ చిత్రపటాలను మోడల్ రూంలో భద్రపరిచారు. కానీ వరదలతో కొట్టుకుపోయే పరిస్థితి ఏర్పడటంతో వాటిని అతిథి గృహం పక్కన వేరే గదిలోకి మార్చారు. నాటి నుంచి మోడల్ రూం ముళ్ల పొదల్లోనే ఉంటోంది. కొందరు ఆకతాయిలు భవనం పై పిచ్చి పిచ్చి బొమ్మలు వేస్తూ రాతలు రాస్తున్నారు. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతోంది. భవిష్యత్తు తరాలకు ప్రాజెక్ట్ చరిత్ర తెలియాలంటే మోడల్ రూంకు పూర్వ వైభవం తీసుకురావాలని పర్యాటకులు కోరుతున్నారు. ప్రాజెక్ట్ నిర్మాణ కాలంలోని చిత్ర పటాలను మళ్లీ మోడల్ రూంకు తరలిస్తే భవిష్యత్తు తరాలకు ప్రాజెక్ట్ గురించి కొంత మేర తెలిసే అవకాశం ఉంటుంది. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ముళ్ల పొదలను తొలిగించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

మోడల్ రూం పునరుద్ధరణకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ముళ్ల పొదలను వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. మోడల్ రూం పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తాం.
– అక్తర్, ఏఈఈ, ప్రాజెక్ట్‌క్యాంప్, పోచంపాడ్

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

ఆర్మూర్‌టౌన్: యువత చెడు వ్యసనాలు వీడి మంచి మార్గంలో నడవాలని స్వేరోస్ చైర్మన్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని క్షత్రియ ఫంక్షన్‌హాల్ ఉమ్మడి జిల్లా స్వేరోస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ప్రపంచం మొత్తం కృత్రిమ మేధస్సు వైపు వెళుతున్న ఈ రోజుల్లో మనం కూడా వాటిని అందిపుచ్చుకొని గొప్పస్థాయికి రావాలని విద్యార్థులకు సూచించారు. ఆరోగ్య పరిరక్షణపై చిట్కాలు, ఆత్మహత్య నివారణ, అక్షరం, ఆర్థికం, ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్వేరోస్ చీఫ్ కన్వీనర్ బలుగురి దుర్గయ్య, వైస్ చైర్మన్ బాలప్రసాద్, స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షుడు వీరయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సాయి, దేవన్న, జైపాల్, లక్ష్మణ్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



లింగన్న పాడె మోస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్



లింగన్న(ఫైల్)

నిజామాబాద్ రూరల్: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటుందని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. గూపన్‌పల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు లింగన్న అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. సాయంత్రం నిర్వహించిన ఆయన అంత్యక్రియలకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్ హాజరై పాడె మోశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. లింగన్న అకాల మృతి పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్యే అన్నారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు విశేష కృషి చేశారని ఎమ్మెల్యే అన్నారు. అంత్యక్రియల్లో పార్టీ జిల్లా నాయకులు బాగిర్తి బాగారెడ్డి, లింగం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి బోల్తాపడిన లారీ



పెద్దకొడప్‌గల్: మండలంలోని బేగంపూర్ చౌరస్తా సమీపంలోని జాతీయ రహదారిపై ఓ లారీ అదుపుతప్పి బోల్తాపడింది. ఆదివారం ఉదయం వేకువజామున హైదరాబాద్ నుంచి నాందేడ్ వైపు వెళ్తున్న లారీ బేగంపూర్ చౌరస్తాలో ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

నల్లా నీటిలో జలగలు

నిజాంసాగర్(జుక్కల్): ఒడ్డేపల్లిలో నల్లా నీటిలో జలగలు వస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. కుళాయిల ద్వారా జలగలు రావడంతో నీటిని తాగేది ఎలా అంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. రెండు రోజులుగా జలగలు వస్తున్నాయని పంచాయ తీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి కుళాయి జలగలు రాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

భూమి దక్కదేమోనని రైతు ఆత్మహత్య

- అప్పులు, భూ వివాదాలే కారణమని సూసైడ్ నోట్
- శాబ్దిపూర్‌లో ఘటన



కృష్ణారెడ్డి (ఫైల్)

కామారెడ్డి టౌన్: అప్పుల బాధతోపాటు భూమి కబ్జాకు గురైందన్న ఆవేదనతో ఓ రైతు సూసైడ్ నోట్ రాసి బలవన్మరణానికి పాల్పడ్డాడు. శాబ్దిపూర్‌లో శనివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రేకులపల్లి కృష్ణారెడ్డి(56)కి 26 గుంటల భూమి ఉంది. అయితే ఈ భూమిని గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కబ్జా చేశారు. సర్వే అధికారులు వచ్చి ఆ భూమి ముగ్గురు వ్యక్తుల కబ్జాలో ఉందని తేల్చారు. ఈ విషయంలో న్యాయం చేయాలని అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. ఓవైపు అప్పుల బాధలు.. మరో వైపు కబ్జాకు గురైన తన భూమి దక్కుతుందో లేదోనన్న ఆందోళనతో మానసికంగా కుంగిపోయాడు. శనివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

సూసైడ్ నోట్‌లో..

రైతు కృష్ణారెడ్డి సూసైడ్ నోట్ రాశాడు. ఐదేళ్ల క్రితం రూ. 80 వేలు అప్పు తీసుకున్నానని, అది వడ్డీతో కలిపి రెట్టింపు అయ్యిందని తెలిపాడు. బాకీలు కట్టలేని పరిస్థితిలో ఉన్నానని, ఉన్న భూమి అమ్మి అప్పులు కడుదామంటే ముగ్గురు వ్యక్తులు(వారి పేర్లు రాశాడు) అమ్మనివ్వకుండా పోలీస్ స్టేషన్‌లో, కోర్టులో కేసు పెట్టారని పేర్కొన్నాడు. ఎస్సై, ఎస్పీ, తహసీల్దార్ దయతలచి తన కుటుంబానికి భూమి ఇప్పించాలని కోరాడు. భూమి గురించి భార్యతో రోజూ లొల్లి అవుతోందని, బాధతో ఆత్మహత్య చేసుకుంటున్నానని పేర్కొన్నాడు. తనను క్షమించాలని భార్య లక్ష్మిని సూసైడ్ నోట్‌లో కోరాడు.

ఇసుక టిప్పర్ల పట్టివేత





రుద్రూర్: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక టిప్పర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ గంగాధర్ తెలిపారు. రెవెన్యూ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పొతంగల్ శివారులో ఒక టిప్పర్, కోటగిరి మండలం వల్లాభాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద రెండు టిప్పర్లను పట్టుకొని కోటగిరి పీఎస్‌కు తరలించారు.

రుద్రూర్: పొతంగల్ మండలం హెగ్డోలి గ్రామ శివారులో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం సాయంత్రం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఈ ట్రాక్టర్లను కోటగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ గంగాధర్ పేర్కొన్నారు.

ఇసుక డంపు స్వాధీనం

పొతంగల్ మండలం సోంపూర్ శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఇసుక 15 ట్రాక్టర్ల వరకు ఉంటుందని తహసీల్దార్ గంగాధర్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలించిన, డంపు చేసిన కేసు నమోదు చేయడంతో పాటు వాహనాలు సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

భిక్కనూరు: బైకును కారు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం భిక్కనూరు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రాజేందర్‌బైక్‌పై భిక్కనూరు చౌరస్తా నుంచి గాంధీ బొమ్మ వైపునకు వెళ్తుండగా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి వచ్చిన కారు ఢీకొన్నది. దీంతో రాజేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు వెంటనే కామారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కుటుంబీకులు హైదరాబాద్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



సమ్మేళనంలో పాల్గొన్న ప్రగతి హైస్కూల్ 1996-97 పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

కామారెడ్డి టౌన్/ భిక్కనూరు: జిల్లా కేంద్రంలోని ప్రగతి హైస్కూల్‌లో పదో తరగతి చదివిన 1996–97 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అలాగే గర్గుల్ ఉన్నత పాఠశాల 1980–81 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం చేపట్టారు. చిన్ననాటి స్నేహితులు ఒకేచోట చేరడంతో సంతోషం వ్యక్తం చేశారు. భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990–91 పదో తరగతి పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. నాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, గురువులు పాల్గొన్నారు.



గర్గుల్ 1980-81 పూర్వ విద్యార్థులు



పెద్దమల్లారెడ్డిలో 1990-91 పూర్వ విద్యార్థులు